క్లుప్తంగా

శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీపీవో

పెగడపల్లి: గ్రామాల్లో శానిటేషన్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డీపీవో రఘువరన్ అధికారులకు సూచించారు. పెగడపల్లిలో శనివారం ఆయన పర్యటించి శానిటేషన్, ఈజీఎస్ పనులను తనిఖీ చేశారు. అనంతరం ఆదర్శ మోడల్ స్కూల్‌ను సందర్శించి పాఠశాల పరిసరాలు, స్వచ్ఛత, పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించి వ్యాధుల నివారణకు కృషి చేయాలన్నారు. పాఠశాల ఆవరణలో ప్రతి విద్యార్థి ఒక్కో మొక్క చొప్పున నాటి సంరక్షించాలని కోరారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, అధ్యాపకులు ఆయన వెంట ఉన్నారు.

వయోవృద్ధులను ఆదరించకపోతే చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న తఫజుల్

జగిత్యాల: వయోవృద్ధులను ఆదరించేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో కార్యాలయ ఏవో తఫజుల్ హుస్సేన్ అన్నారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో పలువురు కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. జగిత్యాల మండలం పొలాసకు చెందిన నర్సవ్వ, పట్టణానికి చెందిన ప్రసాద్‌గౌడ్, ఎండపల్లి మండలం ముంజపల్లికి చెందిన భూమ్మమ్మ కుమారులు, కూతుళ్లపై ఫిర్యాదు చేయగా శనివారం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధులైన తల్లిదండ్రులను పోషించకుండా నిర్లక్ష్యం చేసిన కుమారులకు శిక్షతో పాటు జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ హరి అశోక్‌కుమార్, ఎఫ్ఆర్వో కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వయో వృద్ధుల సంరక్షణను విస్మరిస్తే చర్యలు

మెట్‌పల్లి: వృద్ధులైన తల్లిదండ్రుల సంరక్షణను విస్మరిస్తే వారసులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో శనివారం ఫిర్యాదులపై వారసులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తల్లిదండ్రుల పోషణ, సంరక్షణను పిల్లలు బాధ్యతగా భావించాలన్నారు. వీటిని విస్మరిస్తే ఆరు నెలల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తామన్నారు.

పోచమ్మతల్లి ఆలయంలో ఆర్డీవో పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఆర్డీవో మధుసూదన్

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని గాజుల పోచమ్మ తల్లి ఆలయంలో ఆర్డీవో మధుసూదన్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్వరలో వార్షికోత్సవం జరుగనున్న నేపథ్యంలో ఘనంగా నిర్వహించాలని పేర్కొన్నారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. మాజీ కౌన్సిలర్ రాజేందర్ పాల్గొన్నారు.

అమ్మవారికి పూజలు

జిల్లా కేంద్రంలోని అష్టలక్ష్మీ ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కల్యాణార్థం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ కోదండరామ్‌ను కలిసిన నాయకులు



కోదండరామ్‌తో టీజేఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం: తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండ రామ్‌ను టీజేఎస్ నాయకులు శనివారం హైదరాబాద్‌లో కలిశారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా సన్మానించి పుష్ప గుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి కంది మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చుక్కా గంగారెడ్డి, నాయకులు రాజరెడ్డి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే రాకపోకలు బంద్

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఏఎస్ఆర్ తండా వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామ శివారులోని లోలెవల్ కల్వర్టుపై నుంచి వరదనీరు భారీగా ప్రవహిస్తోంది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన 25 మంది విద్యార్థులు మెట్లచిట్టాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. శనివారం కల్వర్టుపై నుంచి వరద ప్రవహించడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉండిపోయారు. వాగు ఉధృతి తక్కువగా ఉన్న సమయంలో వేరే చోట ఉన్న కొందరు ట్రాక్టర్ ఎక్కి వాగు దాటి ఇంటికి చేరుకున్నారు. వర్షాలు కురిసిన ప్రతిసారి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు పేర్కొన్నారు.



వంతెనపై నీరు ప్రవహించడంతో ట్రాక్టర్‌పై ఎక్కి దాటుతున్న ప్రజలు



సారంగాపూర్: జగిత్యాల నుంచి సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల మీదుగా మంచిర్యాల జిల్లాకు వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్డును ఆనుకుని మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో ఊరకుంట ఉంది. కుంట దాదాపు 50 మీటర్ల లోతు వరకు ఉంటుంది. పూర్తిగా తారు రోడ్డును ఆనుకుని కుంట పూర్తిగా నీటితో నిండుకుని ఉండడంతో రోడ్డు వెంట రోజంతా వందలాది వాహనాలు, వాహనదారులు ప్రయాణం చేస్తారు. రోడ్డు ఆనుకునే కుంట ఉండడంతో భయాందోళన చెందుతున్నారు. ఇటీవల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి సమస్య తీసుకెళ్లగా సెఫ్టీవాల్స్ నిర్మాణానికి హామీ ఇచ్చారు. నిధులు మంజూరయ్యేలోగా తాత్కాలిక రక్షణ గోడ, ప్రమాద సూచికలను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారి ఆదిత్య,ఆర్‌అండ్‌బీ ఏఈ, ఉమ్మడి సారంగాపూర్ ఫోన్ నంబర్, 9440818883

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 94400 61630, 9705346643

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

జగిత్యాలరూరల్/కోరుట్ల/రాయికల్/ మల్లాపూర్/ధర్మపురి/పెగడపల్లి/కథలాపూర్/వెల్గటూర్/గొల్లపల్లి : జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ముందస్తుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో ఉట్టి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు, విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో సందడి చేశారు.



కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు, ఉపాధ్యాయులు, అధికారులు



మల్లాపూర్‌లో కృష్ణాష్టమి సంబరాలు



కోరుట్లలో కోలాటం ఆడుతున్న చిన్నారులు



కోరుట్ల: చిన్ని కృష్ణుడి వేషధారణలో చిన్నారులు



ధర్మపురిలో చిన్నారుల సంబరాలు



దోమలకుంట అంగన్‌వాడీలో చిన్నారులు



జగిత్యాల రూరల్: కృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు

విధులు రద్దు చేసేలా కృషి చేయాలి

జగిత్యాలరూరల్: పంచాయతీ కార్యదర్శులను బీఎల్వో విధుల నుంచి తొలగించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని జగిత్యాల నియోజకవర్గ పంచాయతీ కార్యదర్శులు శనివారం సాయంత్రం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామాల్లో ప్రత్యక్షంగా నిరంతరం పారిశుద్ధ్యం, పరిశుభ్రత, వీధిదీపాల ఏర్పాటు, గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలుతున్న సందర్భంలో పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహించడం భారంగా మారిందన్నారు వెంటనే విధులనుంచి తొలగించేలా చూడాలని కోరారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

ఎమ్మెల్యేను కలిసిన అటవీ శాఖ అధికారి

జగిత్యాలరూరల్: జగిత్యాల జిల్లా అటవీశాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రవిప్రసాద్ శనివారం సాయంత్రం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఆయన వెంట ఎఫ్ఆర్వో పద్మారావు ఉన్నారు.

సేవా దృక్పథంతోనే ఆపరేషన్లు

జగిత్యాల: సేవా దృక్పథంతోనే ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు, వృద్ధులు కంటిపాపను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పావని ఆస్పత్రిలో ఆపీ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసి కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారించిందని, కంటి పాపలు జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్ పాల్గొన్నారు.

కార్యకర్త అంతిమయాత్రలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్: మండలంలోని రాజానగర్ కాంగ్రెస్ కార్యకర్త రాజేశ్వర్‌రెడ్డి శనివారం అనారోగ్యంతో మృతిచెందగా, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గ్రామస్తులతో కలిసి అంతిమయాత్రలో పాల్గొని రాజేశ్వర్‌రెడ్డికి నివాళి అర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు రాజిరెడ్డి, మహేందర్, జగదీశ్, మహిపాల్ రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన జిల్లా అటవీశాఖ అధికారి

జగిత్యాలరూరల్: జిల్లా అటవీశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన రవిప్రసాద్ శనివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేశారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మల్లాపూర్: రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతుల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని కొనియాడారు. అర్హులైన రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ జరుగుతుందని, కొంతమందికే మాఫీ అన్న విపక్షాల దుష్ప్రచారాన్ని, అపోహలు నమ్మొద్దన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రూ.7లక్షల కోట్ల అప్పులను నెత్తినపెట్టడంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ హామీని కేవలం 9 నెలల కాలంలోనే నెరవేరుస్తుండడంతో బీఆర్ఎస్, బీజేపీలకు మింగుడుపడటం లేదని, చిన్న చిన్న సమస్యలను భూతద్దంలో చూపి డ్రామాలకు తెరదీస్తున్నారని దుయ్యబట్టారు. మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకేట నారాయణరెడ్డి, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, సేవాదల్ మండల అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మరిపెల్లి మలయ్య, నూతిపెల్లి రాజం, ఎర్ర భూమయ్య, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, బండారి రమేష్, సుద్దపల్లి మల్లయ్య, ఈసపెల్లి రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జలపతిరెడ్డి

నిరుపేద యువతి పెళ్లికి దాతల సాయం

గొల్లపల్లి: మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన దాసరి గంగజల–గంగరాజం కూతురు రవళిక అనే నిరుపేద యువతి వివాహానికి తాజా మాజీ సర్పంచ్ నేరెల్ల గంగారెడ్డి రూ.5వేలు, ముదిరాజ్ యూత్ సభ్యులు రూ.5 వేలు అందజేశారు. సల్లూరి శోభన్, గడ్డం రాజేందర్, శ్రీ కోటి రఘుపతి రూ.2 వేలు అందజేశారు. మాజీ ఎంపీటీసీ బోయపోతు గంగరాజం కుటుంబ సభ్యులు భోజన వంట సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నేరెల్ల గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ బోయపోతు గంగారాజం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోయపోతు గంగాధర్, గౌడ సంఘం అధ్యక్షుడు ముద్దం లక్ష్మణ్ గౌడ్, బోయపోతు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణ పూర్తి చేయాలి

ఇబ్రహీంపట్నం: మండలంలో వచ్చేనెల 5 వ తేదీలోగా ఓటర్ల జాబితా సవరణ పనులను పూర్తి చేయాని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. మండలంలో బీఎల్‌వోలు చేపడుతున్న ఓటర్ల సవరణ పనులను పరిశీలించారు. ఓటరు జాబితాలో తప్పొప్పులను సవరించాలని సూచించారు. సవరణ అనంతరం రిజిస్టర్‌లో నమోదు చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ గంగాధర్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

నేడు పెద్దగుట్ట నర్సింహస్వామి దర్శనం

సారంగాపూర్: బీర్‌పూర్ పెద్దగుట్ట శ్రీలక్ష్మీనృసింహ స్వామి దర్శనం ఆదివారం జరగనుంది. ఏడాదిలో ఒకరోజు పెద్దగుట్ట నర్సింహస్వామివారి దర్శనం జరుగుతుంది. స్వామివారి ఆలయానికి సమీపంలోని 10 కిలోమీటర్ల ఎత్తు ఉన్న పెద్దగుట్టపై స్వామివారి దర్శనం కోసం బీర్‌పూర్, సారంగాపూర్‌తో పాటు జిల్లాలోని పలు గ్రామాల నుంచి ప్రజలు ఉదయం ఆరు గంటలకు పెద్దగుట్ట దిగువకు చేరుకుని అక్కడి నుంచి పాదయాత్రగా కొండను ఎక్కుతారు. మధ్యాహ్నం కొండపైకి చేరుకుని అక్కడ విశేషారాధన జరిపి అన్నదానం నిర్వహిస్తారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆలయ అర్చకులు వొద్దిపర్తి పెద్ద సంతోష్, చిన్న సంతోష్, మధుకుమారాచార్యులు పేర్కొన్నారు.

సీఎమ్మార్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, అంబారిపేట, దుంపేట గ్రామాల్లో 18 మందికి మంజూరైన సీఎమ్మార్‌ఎఫ్ చెక్కులను శనివారం మండల కాంగ్రెస్ నాయకులు అందదేశారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి చెక్కులు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డీ అజీమ్, నాయకులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు ముదిరాజ్‌లు తరలిరావాలి

పెగడపల్లి: సిద్దిపేటలో జరిగే కొరివి కృష్ణస్వామి విగ్రహ ఆవిష్కరణకు ముదిరాజులు అధిక సంఖ్యలో తరలిరావాలి ముదిరాజ్ సంఘం ధర్మపురి నియోజకవర్గం అధ్యక్షుడు తోడేటి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ముదిరాజ్ కులబాంధవులు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎల్‌ఆర్‌ఎస్ సర్వేకు సహకరించాలి

రాయికల్: పట్టణంలో నిర్వహిస్తున్న ఎల్‌ఆర్‌ఎస్ సర్వేకు దరఖాస్తుదారులు సహకరించాలని కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రజల వద్దకు వచ్చి మున్సిపల్ అధికారులు వచ్చి సర్వే నిర్వహిస్తున్నారని, వారికి సహకరించాలని కోరారు.

గ్రామీణ ఆర్థిక స్థితిగతులపై వ్యవసాయ విద్యార్థుల సర్వే

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ పాలిటెక్నిక్ రెండో ఏడాది విద్యార్థినులు క్షేత్ర సందర్శనలో భాగంగా శనివారం రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామీణ ఆర్థిక స్థితిగతులపై రైతుల నుంచి వివరాలు సేకరించారు. గ్రామంలో సాగు చేసిన ప్రధాన పంటలు, రైతులకు వచ్చే పెట్టుబడి ఖర్చు, ఆదాయంపై రైతులతో సర్వే నిర్వహించారు. అలాగే, రైతులను తీవ్రంగా వేధించే కలుపు మొక్క వయ్యారిభామ లక్షణాలను వివరించి, నివారణ చర్యలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్థిక శాస్త్రవేత్త డాక్టర్ రజనీదేవి, శాస్త్రవేత్తలు రవి, రంజిత్‌కుమార్, ఎప్‌పిఓ చైర్మన్ శంకర్, రైతులు పాల్గొన్నారు.

ధర్మపురి ఎస్సైగా మహేశ్

ధర్మపురి: ధర్మపురి ఎస్సైగా మహేశ్ శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఇంతకముందు ఎస్సైగా విధులు నిర్వహించిన ఉదయ్‌కుమార్ ఉన్నత చదువులకు లాంగ్ లీవ్‌లో ఉండగా, బుగ్గారం ఎస్సై శ్రీధర్‌బాబు ఇన్‌చార్జిగా వ్యవహరించారు.

క్రీడా దుస్తులు పంపిణీ

జగిత్యాల: మహబూబ్‌నగర్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్న క్రీడాకారులకు జగిత్యాలకు చెందిన వైద్యులు డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి క్రీడా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయం సాధించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు విశ్వప్రసాద్, కృష్ణప్రసాద్, అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

జగిత్యాలక్రైం:జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి గ్రామ శివారులో కారు అదుపుతప్పి పొలాల్లో దూసుకెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది. కండ్లపల్లి మోడల్‌స్కూల్‌లో పనిచేస్తున్న ఐదుగురు ఉపాధ్యాయులు శనివారం విధులకు హాజరయ్యేందుకు కారులో బయల్దేరారు. కండ్లపల్లి శివారులోని మోడల్‌స్కూల్ వద్ద కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో బురదలో కారు ఇరుక్కుపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు ఉపాధ్యాయులు క్షేమంగా బయటపడ్డారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న మహిళా సంఘం పంచాయితీ

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం వంజరిపల్లిలో కొన్నేళ్ల క్రితం మహిళా సంఘాలు తీసుకున్న రుణాల్లో జరిగిన అవకతవకలపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారితో పాటు, పోలీసులను మహిళా సంఘం సభ్యులు కోరారు. కానీ ఏళ్లు గడుస్తున్నా రుణాల అవకతవకలకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవడం లేదని నిరసిస్తూ శనివారం మహిళా సంఘ సభ్యులతో పాటు, గ్రామస్తులు జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డిని కలిసి విన్నవించారు. మహిళా సంఘాల్లో జరిగిన అవినీతిపై జిల్లా కలెక్టర్‌తో పాటు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారికి ఫిర్యాదు చేస్తే వారు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పారు.

పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష ఎన్నికలు

జగిత్యాల: జగిత్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షపదవికి వచ్చేనెల 1న జరగనున్నట్లు ఎన్నికల అధికారి మోటూరి శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మంచాల కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 22 నుంచి నామినేషన్లు స్వీకరణ, 25, 26న ఉపసంహరణ, వచ్చేనెల 1న ఎన్నికలుంటాయని పేర్కొన్నారు.

అంతర్గాంలో ఎస్జీఎఫ్ క్రీడలు

జగిత్యాలరూరల్: సెప్టెంబర్ 2న ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎంఈవో గాయత్రి తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు ఫిజికల్ డైరెక్టర్లు పీఈటీల ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో ఎంపిక ఉంటుదని తెలిపారు. సెప్టెంబర్ 3న బాలుర క్రీడా పోటీలు ఉంటాయని తెలిపారు.

తిమ్మాపూర్‌లో ఒకరికి డెంగీ

ధర్మపురి: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో పలువురు జ్వరాలతో బాధపడుతున్నారు. వారిలో ఒకరికి డెంగీ పాజిటివ్ వచ్చినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ తెలిపారు. ఈక్రమంలో అధికారులు, వైద్య సిబ్బంది అప్రమత్తమై గ్రామంలో జ్వర సర్వే, పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. జ్వరం వచ్చిన వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌కు విద్యార్థిని ఎంపిక

జగిత్యాల: రాష్ట్రస్థాయి యూత్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌కు జగిత్యాల పట్టణంలోని జ్యోతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థి టి.సంజన ఎంపికయ్యారు. ఈనెల 25, 26 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి యూత్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ హరిచరణ్‌రావు విద్యార్థినిని అభినందించి రాష్ట్రస్థాయిలో సైతం ప్రతిభ కనబర్చాలని కోరారు.

అనారోగ్యంతో దళిత నాయకుడు మృతి

మల్యాల: మల్యాల మేజర్ గ్రామ పంచాయతీ వార్డు మాజీ సభ్యుడు, దళిత నాయకుడు మల్యాల దేవయ్య శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న దేవయ్య పరిస్థితి విషమించి, శనివారం మృతిచెందాడు. గతంలో మల్యాల గ్రామ పంచాయతీలో రెండుసార్లు వార్డు సభ్యుడిగా పనిచేశారు. 1985లో జగిత్యాల అసెంబ్లీ అభివృద్ధి కమిటీ సభ్యుడిగా దేవయ్య పనిచేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమించాడు. దేవయ్య కుటుంబ సభ్యులను మాజీ ఎంపీపీ ఆదిరెడ్డి, స్థానిక నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం ప్రకటించారు.

దేవయ్య మృతి తీరని లోటు

మల్యాల: మల్యాల దేవయ్య మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మల్యాల దేవయ్య అనారోగ్యంతో శనివారం మృతిచెందగా, ఆయన మృతదేహానికి రవిశంకర్ పూలమాల వేసి, నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

క్రమశిక్షణతో లక్ష్యాలు సాధించుకోవాలి



జగిత్యాల: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో లక్ష్యాలు సాధించుకోవాలని ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొబైల్, ప్రేమ వ్యవహారాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉన్నవారు ఏకాగ్రత కలిగి ఉంటారన్నారు. ప్రభుత్వ కళాశాలలోని అవకాశాలను సద్వినియోగంచేసుకుని వృద్ధిలోకి రావాలన్నారు. అనంతరం పొలిటికల్ సైన్స్ సబ్జెక్ట్‌లో రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన సమ, మహీన్, షరీఫ్ ఉన్నీస, వర్షను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ అలియా మక్సూద్, అధ్యాపకులు పాల్గొన్నారు.